క్లుప్తంగా

నేటి నుంచి ఆలయ మహోత్సవాలు

బోడుప్పల్: చెంగిచర్లలో అభయాంజనేయ స్వామి, శ్రీరామాలయ, శ్రీశివాలయ, నవగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈ నెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. బుధవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, దీక్షా స్వీకరణ, అంకుర్పారణ, గురువారం యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, మూలమంత్ర హోమం, శుక్రవారం యాగశాలలో నిత్యారాధన, హోమం, శనివారం మండల ఆరాధనలు, పుష్పఫలం, ఆదివారం హోమాలు, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, 13వ తేదీన ప్రాణప్రతిష్ఠ హోమాలు, మహాపూర్ణాహుతి, మహా కుంభ సంప్రోక్షణ, అన్నదానం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఇక నీటి కష్టాలకు చెక్



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

రామంతాపూర్: రామంతాపూర్‌లోని నేతాజీనగర్, రాజేంద్రనగర్‌లోని హిందూ శ్మశానవాటికల్లో బోరు పంపులు పనిచేయక వారం రోజులుగా అంత్యక్రియలకు హాజరయ్యేవారు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని 'శ్మశానంలో నీటి కష్టాలు' శీర్షికన మంగళవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉన్నతాధికారులు సెలవు రోజైన మంగళవారం బోరు పంపులకు మరమ్మతులు చేయించారు. దీంతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

శిల్పారామంలో కళాతపస్వికి కళా నీరాజనం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో హోలీ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సినీ దర్శకులు డాక్టర్ విశ్వనాథ్ దంపతులకు కూచిపూడి నాట్య నీరాజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంగీత ప్రాముఖ్యతను వివరిస్తూ వారి సినిమాల్లో నాట్యానికి సంబంధించిన పాటలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో నివాళులర్పించారు. శ్రీగణనాథమ్, ఆనతి నీయరా, రాగం.. తానం తదితర పాటలకు గౌతమి, అడపా, భరణి, సరోజ, నళిని రమణ తదితరుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


10వ రోజుకు రిలే నిరాహార దీక్షలు



దీక్షల్లో కూర్చున్న మహిళలు

బోడుప్పల్: వక్ఫ్ బోర్డు బాధితుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు మంగళవారం 28వ డివిజన్‌లోని గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వారికి సంఘీభావంగా జేఏసీ కో చైర్మన్ కొత్త కిశోర్‌గౌడ్, కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు కొంపల్లి మోహన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ప్రజలకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం దీక్షల్లో ప్రమోద్‌కుమార్, సులోచన, ధనుంజయరావు, అశోక్, శ్రీవాణి కూర్చున్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి



దేవేంద్రప్ప

అల్వాల్: చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈస్ట్ చంద్రగిరి కాలనీలో నివాసముండే దేవేంద్రప్ప(73) గతనెల గుర్తు తెలియని ద్రావణం సేవించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వృద్ధుడు సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాలీగా హోలీ



మల్లాపూర్ వార్డు కార్యాలయం వద్ద హోలీ వేడుకల్లో బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి



బోడుప్పల్ 13వ డివిజన్ కార్పొరేటర్ దంపతులు దానగల్ల అనిత, యాదగిరి

హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ఈ పర్వదిన వేడుకలో భాగంగా ముందు రోజైన సోమవారం రాత్రి వివిధ ప్రాంతాల్లో కాముడి దహన కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి హోలీ సంబరాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా చిన్నారులు, యువత, మహిళలు, స్నేహితులు, బంధువులు అంతా ఒకచోట చేరి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



చర్లపల్లి చెరువు వద్ద హోలీ వేడుకల్లో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



ఉప్పల్ అపూరూప జగపతి హైట్స్‌లో కామదాహనం



ఉప్పల్ అపూరూప జగపతి హైట్స్‌లో హోలీ సంబురాలు



బోడుప్పల్ చెంగిచర్ల 1వ డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్



కాప్రా, ఏఎస్‌రావునగర్‌లో హోలీ సంబరాలు



మల్లాపూర్ వాకింగ్ డీర్స్ మిత్ర బృందం



గౌతంనగర్ డివిజన్ పరిధిలో..





డిఫెన్స్ కాలనీలోని నార్త్ పార్కులో..



మౌలాలి డివిజన్‌లో హోలీ సంబరాలలో కార్పొరేటర్ సునీత

వైభవంగా సత్యదేవుడి కల్యాణం



స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, మేయర్

రామంతాపూర్: ఉప్పల్ సర్కిల్ రామంతాపూర్‌లోని రమాసహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 50వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దేవస్థానం కల్యాణ మండప వేదికపై సత్యనారాయణ స్వామి రమాదేవిల కల్యాణ వేడుకలను మంగళవారం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆలయ చైర్మన్ కోట్ల నర్సింహారెడ్డి స్వామి వార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కల్యాణ వేడుకలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది తరలివచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణివెంకట్రావు, బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్నానాగేశ్వర్‌రావు, ఆలయ ఈవో సత్య చంద్రారెడ్డి, అన్నమనేని జగదీష్, ప్రధానార్చకులు పాల్గొన్నారు.



కన్నుల పండువగా సత్యదేవుడి కల్యాణం

కుక్కల కు.ని. చికిత్సలో పారదర్శకత అవసరం



కు.ని. ఆపరేషన్ అయిన వాటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: వీధి కుక్కల కుటుంబ నియంత్రణలో పారదర్శకత ఉండాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అభిప్రాయపడ్డారు. నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అన్ని పార్టీలతో కూడిన అఖిలపక్ష హైలెవల్ కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ మహానగరంలో వీధి కుక్కల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల అంబర్‌పేట లాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో వెటర్నరీ కేర్ సెంటర్లను సందర్శించి ప్రతిపాదనలు పెడతామన్నారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో 705 మద్యం సీసాలు స్వాధీనం

ఉప్పల్: హోలీ సందర్భంగా వైన్‌షాప్‌లు మూసివేయడంతో ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బెల్టు షాపులు తెరుచుకున్నాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు నిఘా పెట్టి బెల్టుషాపుల నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ ప్రాంతానికి చెందిన రమేష్, చిలుకానగర్ ప్రాంతానికి చెందిన సోమేష్, సోనుకుమార్ యాదవ్ రామంతాపూర్ ప్రాంతానికి చెందిన ఎన్.శివకుమార్, కురుమానగర్ ప్రాంతానికి చెందిన సంపత్ హోలీ సందర్భంగా మద్యం దుకాణాలు మూసి వేయడంతో భారీగా మద్యం కొనుగోలు చేసి ఇళ్లలో స్టాక్ పెట్టుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వివిధ చోట్ల ఐదుగురు వ్యక్తులను ఉప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వీరి వద్ద నుంచి మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మద్యం సీసాలతో పోలీసులకు చిక్కిన నిందితులు

దొంగల ముఠాలపై ఉక్కుపాదం

కమిషనర్ డీఎస్ చౌహాన్



అల్వాల్: రాచకొండ కమిషనరేట్ పరిధిలోని సీసీఎస్ పోలీసు అధికారులతో కమిషనర్ డీఎస్ చౌహాన్ డీసీపీ క్రైమ్ మధుకర్ స్వామితో కలిసి నేరెడ్‌మెట్‌లోని కమిషనర్ ఆఫీస్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో చోరీలను అరికట్టాలని, ప్రజలు ధైర్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బంగారం, పెద్ద మొత్తంలో డబ్బును దోచుకునే దొంగల ముఠాలను వెంటాడి పట్టుకుంటామని తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో నేర పరిశోధనలో సీసీటీవీ కెమెరాలను ఉపయోగించుకోవాలని అధికారులకు సూచించారు. గతంలో నేరాలకు పాల్పడిన రాచకొండ పరిధిలోని ముఠా సభ్యులపై నిఘా వేసి ఉంచాలని, వారు మళ్లీ నేరాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరుసగా నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టులు పెట్టాలని ఆదేశించారు. బయటకు వెళ్తున్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, బీరువాలు, అల్మారాల తాళం చెవులు అందుబాటులో ఉండకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నేరాల దర్యాప్తులో సివిల్, ట్రాఫిక్ వంటి ఇతర విభాలతో పాటు సాంకేతిక విభాగాలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాగా పనిచేసిన అధికారులను అభినందించి సత్కరించారు. బంగారాన్ని బ్యాంకు లాకర్లలో పెట్టుకోవాలని సూచించారు. వీలైనంత వరకు కమ్యూనిటీ సీసీటీవీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీఎస్ అదనపు డీసీపీ లక్ష్మి, ఏసీపీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతోనే ఉన్నత స్థానం



యండమూరిని సన్మానిస్తున్న నిర్వాహకులు

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. మంగళవారం సన్నిహిత హోం ఆధ్వర్యంలో హోటల్ పార్క్ లేన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మనిషి విజ్ఞానానికి క్రమశిక్షణ, పట్టుదల తోడైతే విజయం మీ సొంతం అవుతుందన్నారు. విద్యార్థులు సినిమాలు, సోషల్ మీడియా జోలికి వెళ్లకుండా చదువుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు 'ప్రెసెన్స్ ఆఫ్ మైండ్' అంశంపై పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖ సైకాలజిస్టు మేరీ జోన్ విద్యార్థినులకు మానసిక అంశాలపై అవగాహన కల్పించారు. సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ రాజశ్రీ విద్యార్థినులకు ఆరోగ్యంపై జాగ్రత్తలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శారద, సన్నిహిత డైరెక్టర్ ఉషారాణి, ఉపాధ్యక్షురాలు కిరణ్మయి, సీడబ్ల్యూసీ మాజీ చైర్ పర్సన్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



లయోలా అకాడమీలో మహిళా దినోత్సవం

అల్వాల్/గౌతంనగర్: అల్వాల్ లయోలా అకాడమీలో మహిళా దినోత్సవం సందర్భంగా వారం రోజులుగా కళాశాలలలోని విద్యార్థులు, మహిళా ఉద్యోగులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిట్ ఆల్–ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలిగి అనే అంశంపై విద్యార్థులు, మహిళా అధ్యాపకులకు ఎలక్యూషన్ మెహందీ కాంపిటేషన్ నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. డాక్టర్ మామిడి సురేఖ, కళాశాల రెక్టర్, కరస్పాండెంట్ ఫాదర్ అమరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్. జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్స్ అరుల్‌జ్యోతి, జోసెఫ్ కుమార్ పాల్గొని మహిళా ఉద్యోగులను అభినందించారు.

మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో..

మహిళా దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న సఫాయి మహిళలకు విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవీ.స్వామి, నూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రాన్ని అందుకుంటున్న సాంబశివరావు

మల్లాపూర్: వాసవి మాత, ఐవీఎఫ్ ఇంటర్నేషనల్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా నాచారం ప్రాంతానికి చెందిన పరిటాల సాంబశివరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐవీఎఫ్ సెంట్రల్ వర్కింగ్ వైస్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళిగుప్తా, టూరిజం కార్పొరేషన్ చైర్మన్, ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం పరిటాల సాంబశివరావు మాట్లాడుతూ.. ఐవీఎఫ్ బలోపేతం, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

మూడిళ్లలో చోరీ

మేడ్చల్: పట్టణంలోని కిష్టాపూర్ అర్చన కాలనీలోని మూడిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. అర్చన కాలనీలో నివాసముంటున్న శ్రీనివాస్‌రాజు, హన్మంత్‌రెడ్డి ఇళ్లలో దొంగలు తాళాలు పగుల గొట్టి చోరీకి పాల్పడ్డారు. హన్మంత్‌రెడ్డి ఇంట్లో నాలుగు పోర్షన్లు ఉండగా రెండు గదుల్లో వర్కింగ్ ఉమెన్స్ అద్దెకు ఉంటున్నారు. వారు డ్యూటీలకు వెళ్లడంతో రాత్రి ఇంటికి రాలేదు. అందులో ఒక యువతికి 1వ తేదీన వేతనం రావడంతో ఇంట్లోనే పెట్టి డ్యూటీకి వెళ్లింది. దొంగలు ఇంటి తాళాలు పగుల గొట్టి అక్కడ ఉన్న రూ.25 వేలు దోచుకెళ్లారు. కాగా హన్మంత్‌రెడ్డి ఇంట్లోనూ దొంగలు చొరబడి చోరీకి యత్నించగా నగదు, ఆభరణాలు వారికి లభించ లేదు.
◆ అదే కాలనీలో క్యాంటిన్ నడుపుతూ జీవనం సాగించే శ్రీనివాస్‌రాజు, రాణిలు నివాసముంటున్నారు. రాత్రి క్యాంటిన్‌లో ఉండటంతో వారు ఉంటున్న ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న 10 తులాల బంగారం, రూ.45 వేల నగదును దోచుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భర్త మృతి తట్టుకోలేక భార్య ఆత్మహత్య

అల్వాల్: భర్త మృతి తట్టుకోలేక భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సురేష్ వివరాల ప్రకారం.. వెంటాపురంలో నివసించే విశ్వనాథన్ మౌనిక(29)కు లాల్‌బజార్‌లో నివాసముండే నరేష్‌తో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. అనారోగ్యంతో ఇటీవల భర్త నరేష్ మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె మానసికంగా ఇబ్బంది పడుతోంది. వెంకటాపురంలోని పుట్టింటికి వచ్చింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మౌనిక జూమ్ మీటింగ్ ఉందంటూ సోమవారం రాత్రి గదిలోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళాభ్యున్నతికి పెద్దపీట

లాలాపేట: గ్రేటర్ హైదరాబాద్‌లో మేయర్‌గా, డిప్యూటీ మేయర్‌గా మహిళలకే అవకాశం కల్పించి ముఖ్యమంత్రి కేసీఆర్ విశ్వనగరంలో మహిళల ఆత్మగౌరవాన్ని మరింత పెంచారని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పించడంతో పాటు మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంభన కోసం డ్వాక్రా రుణాలు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, గర్భిణీలు,, బాలింతలకు ప్రోత్సాహకాలు, కేసీఆర్ కిట్ సహా దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. తాజాగా ఆరోగ్య మహిళా కార్యక్రమానికి తెలంగాణ సర్కారు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలోని మహిళలందరూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని కోరారు.